నగరానికే 'గైస్' గర్వకారణం

మేయర్ హరి వెంకటకుమారి



కళాశాల అధ్యాపకులతో మేయర్ హరివెంకట కుమారి



పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మురళీనగర్: పాలిటెక్నిక్ స్థాయిలో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ నూరు శాతం ఉద్యోగాలు సాధించడం విశాఖ నగరానికే గర్వకారణమని విశాఖ నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒక ఏడాదిలో 243మంది ఉద్యోగాలు సాధించడం రాష్ట్రంలోనే ఒక రికార్డు కాగా వీరిలో 54మంది బాలికలు ఉండడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా హెచ్‌పీసీఎల్‌లాంటి ప్రభుత్వ రంగ సంస్థలో 85మంది ఉద్యోగాలు సాధించడానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. గైస్ విద్యార్థిని డి.వంశీప్రియాంక ఏషియన్ పెయింట్స్‌లో అత్యధిక ప్యాకేజీ రూ.6.73లక్షలు పొందిన మొట్టమొదటి విద్యార్థినిగా రికార్డు సాధించిందని ఆమె ప్రశంసించారు. వీరిని జూనియర్స్ ఆదర్శంగా తీసుకుని ఉన్నత అవకాశాలు పొందాలని ఆమె ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశలతో పాటు తమ ఆశయాలు నెరవేర్చుకునేందుకు విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. ఇలాంటి జాబ్ అచీవర్స్ ఉత్సవాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయన్నారు. ప్రత్యేక అతిథి 54వ వార్డు కార్పొరేటరు చల్లా రజనీ ఈశ్వరరావు మాట్లాడుతూ తమ వార్డులోని కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉద్యోగాల సాధనలో రికార్డు సృష్టించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ తమ కాలేజీకి ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుతోపాటు ప్రిన్సిపాల్‌గా గ్లోబల్ అచీవ్‌మెంటు అవార్డు, ఇంటర్నేషనల్ అకడమిక్ లీడర్, గ్లోబల్ ఫ్యాకల్టీ అవార్డులు వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన 243మందికి మేయరు హరి వెంకటకుమారి, కార్పొరేటరు రజనీ ఈశ్వరరావు నియామక పత్రాలు అందించారు. అనంతరం తల్లిదండ్రులను, ప్రిన్సిపాల్ వెంకటరమణను సత్కరించారు. ముందుగా లవ్ గైస్ లోగోను మేయరు హరివెంకట కుమారి కార్పొరేటరు రజనీ ఈశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎస్‌టీడీ లోకల్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఓ.రామమోహన్‌రావ్, కెమ్‌దోసా అధ్యక్షుడు ఎ.వరహాలు, సభ్యులు డాక్టర్ బోకం దేముడు, యూఎస్ శర్మ, బీఎస్ రామమోహన్, కెమికల్ ఇంజినీరింగు హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు సీహెచ్.జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, ఓఎస్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో ఎల్.టి. లైన్లు మరమ్మతుల నిమిత్తం ఎస్ఎస్ 141, శ్రీనివాసనగర్ ఏరియా, ఎస్ఎస్ 143, సీతంపేట ప్రాంతం, ఎస్ఎస్ 334, రామాలయం వీధి ప్రాంతంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. వినియోగదారులు సహకరించాలని జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

దోమల నియంత్రణకు ఫాగింగ్



షాదీఖానా రోడ్డులో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు అబిద్‌నగర్, శ్రామికవీధి ప్రాంతాలలో దోమల నియంత్రణకు జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది ఫాగింగ్ చేశారు. షాదీఖానా, దోబీఖానా, స్కీం ఇళ్లు, సామాజిక మరుగుదొడ్లు, మసీదు ప్రాంతాలలో రహదారుల వెంబడి ఫాగింగ్ చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి సైఫ్రోత్రిన్ మందును అవుట్ డోర్‌లో ఫాగింగ్ చేస్తున్నట్టు తెలిపారు.

జోరుగా రహదారుల పునరుద్ధరణ



అబిద్‌నగర్‌లో పాడైన రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 43, 44 వార్డుల్లో గోతుల పడిన రహదారుల పునరుద్ధరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. దెబ్బతిన్న రహదారులకు ప్యాచ్‌వర్క్ చేస్తున్నారు. 43వ వార్డులో నందగిరినగర్, శ్రీనివాసనగర్, జగన్నాథపురం ప్రాంతాలలో, 44వవార్డు అబిద్‌నగర్, రామచంద్రానగర్ ప్రాంతాలలో రహదారులలో ఉన్న గోతులను తారుతో ప్యాచ్ వర్క్ చేసి రోలింగ్ చేస్తున్నారు. రహదారులలో గోతులను పూడ్చడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవునికి లక్షమల్లెలతో అర్చన



లక్షమల్లెలతో అర్చన అందుకున్న వైభవుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. ఉదయం స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వైభవ వేంకటేశ్వరుడికి లక్ష మల్లెలు సమర్పించారు. సాయంత్రం సదస్యోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నిరుపయోగంగా బోరు




మారుతీ నగర్‌లోని మరమ్మతులకు గురైన బోరు

సీతమ్మధార: జీవీఎంసీ పరిధి 14 వార్డులోని మారుతీనగర్‌లోని దరి 11/27 గల బోరు పని చేయడం లేదు. చాలాకాలంగా ఈ బోరు మరమ్మతులకు గురవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి చర్యలు బోరును వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

7 నుంచి దుర్గమాంబ మహోత్సవాలు



దుర్గాదేవి అమ్మవారు



ముస్తాబవుతున్న దుర్గాదేవి ఆలయం

కంచరపాలెం: గొల్లకంచరపాలెం వాసుల ఆరాధ్యదైవం దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఉత్సవాలను ఈ నెల 7 నుంచి నిర్వహించనున్నట్లు శ్రీ రామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. 7న దుర్గమాంబ జాతర చాటింపు, 8న తొలేళ్ల సంబరం, 9న ప్రధాన జాతర నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. 9న ప్రధాన జాతర మహోత్సవాన్ని గొల్లకంచరపాలెం శ్రీసీతారామ సంపత్ వెంకటేశ్వర, ధనలక్ష్మీదేవి ఆలయం నుంచి అమ్మవారి ప్రతిమలతో ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ప్రతిమలు కావాల్సిన భక్తులు ముందుగా పేర్లు నమోదుకు ఉత్సవ కమిటీ సభ్యులను సంప్రదించాలని ఆయన కోరారు.

శానిటరీ కార్మికులకు సామాగ్రి పంపిణీ



పారిశుధ్య కార్మికులకు సామాగ్రి అందజేస్తున్న కార్పొరేటర్ కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం ఇందిరానగర్ వార్డు శానిటరీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు సామాగ్రిని వార్డు కార్పొరేటర్ గంకల కవిత మంగళవారం పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు ప్రతి ఏటా అందిస్తున్న ఫోర్ వీల్స్, వీల్ బార్స్, టు వీల్స్ పరికరాలు, 4 లీటర్ల కొబ్బరినూనె బాటిల్స్ పంపిణీ చేసినట్లు కార్పొరేటర్ కవిత తెలిపారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.అప్పలరాజు, వార్డు బీజేపీ అధ్యక్షుడు గంకల అప్పారావు పాల్గొన్నారు.

45వ వార్డులో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం హైవే జంక్షన్ వద్ద గౌరీ సేవా సంఘం, కైలాసపురం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మంగళవారం ప్రారంభించారు. వేసవిలో బాటసారుల దాహం తీర్చేందుకు నెల రోజుల పాటు మంచినీరు, మజ్జిగ అందించనున్నట్లు కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు లచ్చ అప్పారావు, కైలాసపురం శాఖ అధ్యక్షులు విష్ణు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీలా హరిప్రసాద్, సంఘం ప్రతినిధులు అంజిబాబు, మల్లిఖార్జున, సత్యనారాయణ, ఈశ్వర్, భవాని తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీమణులు

సీతంపేట: నారీ భేరి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక పౌరగ్రంథాలయంలో వైశాఖమాసం వసంతగానం పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. పెమ్మరాజు రామ్, శైలజా మెరాజ్ పాడిన చల్లని గాలి చక్కని తోట, వీవీ చారి, సీవీ రాజేశ్వరి పాడిన ఏదో పిలిచినది, పుండరీకుమార్, భాగ్యలక్ష్మి పాడిన ఇక్కడే కలుసుకున్నాము, వెంకటరెడ్డి, శైలజ పాడిన ఆనందోబ్రహ్మ, రాజేశ్వరి, నాయుడు పాడిన లలిత ప్రియ కమలం, ఎంవీఆర్ నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మి, సీవీ రాజేశ్వరి పాడిన చల్లని రాజా ఓ చందమామ గీతాలు ప్రేక్షకులను అలరించాయి. వీరికి కీబోర్డుపై సోమేశ్, తబలాపై బీవీ రమణమూర్తి, ప్యాడ్స్‌పై విజయ్, గిటారుపై నాగు పాటకు తగ్గ వాయిద్య సహకారం అందించారు. ఎంవీఆర్ నాగేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

సామాజిక సేవా కార్యక్రమాల విస్తృతి



నడక పోటీ విజేతలు బహుమతులు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ నెలవారి సమావేశం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల సహకారంతో పార్కులో పచ్చదనం పెంపుతోపాటు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా నూతనంగా చేరి సభ్యులతో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం ప్రమాణ స్వీకారం చేయించారు. వాకర్ లంకా ఆదినారాయణ స్మారక ద్వితీయ వార్షిక నడక పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈనెలలో పుట్టినరోజు వేడుకలు జరుపుకునే సభ్యులకు చిరుకానుకలను అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎల్.వెంకటసుధాకర్ పాల్గొన్నారు.

పోలమాంబ సన్నిధిలో వంశీకృష్ణ

బీచ్ రోడ్డు: శివాజీపాలెంలో కొలువైన పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు.

చెత్తతో అవస్థలు



రేసపువానిపాలెం రోడ్డులో నిండిపోయిన చెత్త

సీతమ్మధార: జీవీఎంసీ పరిధి 24 వార్డులోని రేసపువానిపాలెం (హైవే)కు వెళ్లే రోడ్డులో ఎక్కడ చూస్తే అక్కడే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. శానిటరీ అధికారులు పట్టించుకోకపోవడంతో మూడు రోజులుగా చెత్త పేరుకుపోయింది. దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య విభాగ అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నారుల పార్కుకు మోక్షమెప్పుడో?



ఇందిరా గాంధీ చిల్డ్రన్ పార్కు ప్రవేశ ద్వారం



రక్షణ గోడలేని పార్కు

బీచ్ రోడ్డు: తీరానికి వచ్చే చిన్నారులతో రోజూ సందడిగా ఉండే ఆ పార్కు గత కొద్ది నెలలుగా వెలవెలబోతోంది. సముద్ర అలలకు కోతకు గురై కొద్ది నెలలుగా మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది. నొవొటల్ ఎదురుగా తీరం చెంతన ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ చిల్డ్రన్ పార్కు కొద్ది నెలల కిందట అలల ఉధృతికి దెబ్బతింది. పార్కు రక్షణ గోడ మొత్తం పడిపోయింది. ఈ సంఘటన జరిగిన చాలా నెలలు కావస్తున్నా జీవీఎంసీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో పార్కులో చిన్నారుల సందడి తగ్గిపోయింది.

బయట హంగులు

జీ-20 సదస్సు కోసం సాగరతీరంలో ఆధునికీకరణ పనులు చేపట్టి అందంగా ముస్తాబు చేశారు. వీటిలో పలు పార్కులను కూడా ఆధునికీకరించారు. కానీ ఆర్కే బీచ్‌కు సమీపంలోని పిల్లల పార్కును మాత్రం జీవీఎంసీ అధికారులు వదిలేశారు. పార్కు బయట రంగులు వేసి విడిచిపెట్టేశారు. లోపల ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. కనీసం రక్షణ గోడ నిర్మాణంపై కూడా దృష్టి సారించలేదు. దీంతో చిన్నారులను పార్కులోకి తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు రక్షణ గోడ నిర్మాణం, మరమ్మతులు చేపట్టిన జీవీఎంసీ అధికారులు చిన్నారుల పార్కులో మాత్రం ప్రహరీ నిర్మించకపోవడంపై సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును ఆధునికీకరించి, సదుపాయాలు కల్పించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాడైన ఫౌంటైన్

రెండేళ్లలో మూడు లక్షల ఉద్యోగాలు

మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి



నియామక పత్రాలు అందిస్తున్న మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి

మురళీనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక చర్యల వల్ల రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో యువతకు మూడు లక్షల ఉద్యోగాలు వస్తాయని మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి చెప్పారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేవలం పాలిటెక్నిక్ విద్యార్థులకు లక్ష ఉద్యోగాలు వస్తాయన్నారు. విశాఖ పోర్టులోనే 25వేలు ఉద్యోగాలు వస్తాయన్నారు. డిప్లమా విద్యార్థులు కోర్సుల పూర్తి కాగానే వచ్చే ఉద్యోగావకాశాలను వదులుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలు వీలైనంత త్వరగా జీవితంలో స్థిరపడే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ జాబ్ మేళా సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కంపెనీల్లో చేరిన వారు నిబద్ధతతో పని చేస్తే అత్యధిక ప్యాకేజీలు వస్తాయన్నారు. డిప్లమా అనంతరం ఉన్నత విద్యకు వెళ్లడం కన్నా ఉద్యోగాల్లో చేరడం తెలివైన పనిగా ఆయన పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ అసిస్టెంటు కమిషనర్ ఎ.త్రినాథరావు మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌ల పట్ల విద్యార్థులు అప్రమత్తతతో ఉండాలన్నారు. ఉద్యోగాలు పొందిన 172 మంది విద్యార్థులకు మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంటు సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో హేమ ఎడోబ్స్ చైర్మన్ బి.సురేష్‌కుమార్, ఎస్‌బీటీఈటీ అకడమిక్ సంయుక్త కార్యదర్శి జీవీవీ సత్యనారాయణమూర్తి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు పాల్గొన్నారు. ముందుగా మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంటు సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి కాలేజీలోని స్కిల్ హబ్‌ను సందర్శించి శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు.

ప్రత్యేక శిక్షణతో ప్రతిభకు పదును



జ్యోతిప్రజ్వలన చేస్తున్న స్కూల్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ జోసెఫ్



శిక్షణ పొందుతున్న చిన్నారులు

సీతమ్మధార: చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని ఎస్ఎఫ్ఎస్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ జోసెఫ్ పేర్కొన్నారు. నెల రోజులు పాటు సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో నిర్వహించనున్న వేసవి నృత్య శిక్షణా తరగతులను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ శిక్షణ పొందిన బాల నృత్య కళాకారులు అతర్జాతీయ స్థాయి సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయమన్నారు. స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజు పట్నాయక్ బృందం ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తోందని, విశాఖ నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు శిక్షణలో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ మనోజ్ తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తామని, ప్రదర్శనలనూ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కళాకారులు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఈ శిక్షణ తరగుతుల జరుగుతాయని హిల్డా మాథ్యూస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కొరియోగ్రాఫర్ వల్లా శివకుమార్, స్కూల్ ప్రతినిధులు గోవింద్‌రాజు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పరికరాల పంపిణీ



కార్మికులకు కొబ్బరినూనె సీసాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో పారిశుధ్య కార్మికులకు పరికరాలను అందజేశారు. ఈ మేరకు వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మంగళవారం మాధవస్వామి కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న ఫోర్‌వీల్స్, టూ వీల్స్ బార్‌లను సచివాలయానికి రెండు చొప్పున మొత్తం ఆరు సచివాలయాలకు 12 వీల్స్ బార్‌లను అందించారు. అలాగే పరికరాలను కూడా అందజేశారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య దృష్ట్యా ప్రతి ఒక్క కార్మికుడికి 4 లీటర్లు కొబ్బరినూనె సీసాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య దృష్ట్యా వార్డులో ఉన్న ప్రతి ప్రాంతలోనూ సెక్రటరీలు జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు జోసెఫ్, శ్రీను, గంగరాజు, హేమంత్, శానిటరీ సూపర్‌వైజర్లు రమేష్, శ్రీను, కొండబాబు, కరిమిరెడ్డి శ్యామ్, రెయ్యి గణేష్ పాల్గొన్నారు.

రోడ్డు మలుపులో గొయ్యి



అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద రోడ్డు మలుపులో ఏర్పడిన గొయ్యి

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో జగ్గారావు బ్రిడ్జి రోడ్డు మలుపులో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్ నుంచి రామకృష్ణానగర్ చేపల బజార్ రోడ్‌లోకి మలుపు తిరిగేచోట రహదారి కుంగిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. గొయ్యి ఏర్పడి మూడు వారాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామకృష్ణానగర్ నుంచి అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌కు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దీనికి తోడు సమీపంలో ఉన్న కూరగాయలు, చేపల బజారుకు వచ్చే వినియోగదారులతోరద్దీగా ఉంటుంది. రాత్రి సమయంలో వాహనచోదకులు గోతిలో పడి గాయాలపాలయ్యే ప్రమాదముందని స్థానికులు గొయ్యి వద్ద హెచ్చరికగా కర్రలు పెట్టారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

యూజీడీ మ్యాన్‌హోల్ లీకుతో అవస్థలు



జగ్గారావు బ్రిడ్జి వద్ద లీకవుతున్న మ్యాన్‌హోల్



హిందూ ముస్లిం కాలనీలో మ్యాన్‌హోల్ లీకు

సీతంపేట: యూజీడీ మ్యాన్‌హోల్స్ తరచూ ఎక్కడో చోట లీకవుతూ మురుగు నీరురోడ్డెక్కి ప్రవహిస్తూ ఉండటం వార్డుల్లో సర్వసాధారణమైంది. జీవీఎంసీ 25, 26 వార్డుల్లో యూజీడీ మ్యాన్ హోల్స్ లీకవుతున్నాయి. 26వ వార్డు రామకృష్ణానగర్ జగ్గారావు బ్రిడ్జి చేపల బజారు వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగు నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండటంతో దుర్వాసనతో బజారుకు వచ్చే వినియోగదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే 25వ వార్డు హిందూ ముస్లిం కాలనీ వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతూ, మురుగు నీరురోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తిపై దాడి

సీతమ్మధార: భగత్‌సింగ్ కాలనీకి చెందిన సోంబాబు ఆటో నడుపుతుంటాడు. మారికవలసకు చెందిన దీన్‌దయాల్ వద్ద రెండేళ్ల క్రితం రూ.8 వేలు అప్పు తీసుకున్నాడు. సోమవారం రాత్రి సోంబాబు ఇంటికి వచ్చి తక్షణం డబ్బులు కావాలని దీన్‌దయాల్ డిమాండ్ చేశాడు. తరువాత ఇస్తానని చెప్పగా సోంబాబు కంటిపై దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదుతో కేసు ద్వారకా ఎస్ఐ ధరేంద్ర కేసు నమోదు చేశారు.